# నాయనా రవీ!

మూడు రోజుల్నించీ బిడ్డ కలల్లోనూ కళ్లల్లోనూ మెదిలి అనసూయమ్మకి కళ్లలో నీరు చిమ్ముతున్నది చిమ్ముతున్నట్టే వుంది. నెత్తురు చిమ్మేలా గుండెను ఎవరో పిండుతున్నట్టే వుంది. తన కన్న కడుపులో కత్తులతో ఎవరో కుమ్ముతున్నటే వుంది. పగలుకాని రాత్రికాని కంటికి కునుకు పడితే బిడ్డమీద వొట్టే-

తన కలల పంటగా పుట్టిన బిడ్డ, కళ్లల్లో వొత్తులు వేసుకు పెంచిన బిడ్డ, కంటి నిండుగా ఎదిగిన బిడ్డ, ఈ యింటికి జ్యేష్ఠ పుత్రుడు, రేపు వార్ధక్యంలో తను మూలపడితే కాపాడ వలసిన కన్న తండ్రి - రవి, ఇల్లు వదిలి వెళ్లి నేటికి ఆరేళ్లయిఁది.

"రవీ-రవీ-రవీ-నానాయనా-నా-తండ్రీ- ఈ అమ్మమీద జాలి లేదా నాయనా. ఈ దుఃఖం నేను భరించ లేకుండా వున్నానురా ఒక్కసారి-ఒక్క సారంటే ఒక్కసారి-కనిపించి పోరా రవీ" ఈ మాటలు ఆ తల్లి ఇప్పటికి కొన్నివేల సార్లు అనుకున్నది. మొగుడు ఇంటలేని సమయంలో గొంతెత్తి అరుస్తూ హృదయ విదారకంగా ఏడిచింది. రాళ్లు కరిగేలా విలపించింది. ఇంటి ముందున్న వేపచెట్టు కూడా దుఃఖిస్తున్నట్టే వుంది. ఆ తల్లిశోకం చిక్కని చీకటి కంటె గాఢంగా వుంది. ఆ తల్లి కన్నీరు సముద్రపు నీటికంటె కటువుగా వుంది. కన్నీళ్లతో కాటుక పెట్టుకున్నట్టుంది.

అనసూయతో పాటు పెళ్లయిన వాళ్లందరికీ ఏడాది తిరిగేసరికి బిడ్డలు పుట్టారు. ఒకరిద్దరికి ఒకటి రెండేళ్ళు తరవాత పుట్టారు. అనసూయకు పెళ్లయి మూడేళ్లు దాటినా బిడ్డలు కలగలేదు నలుగురూ నాలుగు రకాలుగానూ అన్నారు.

"ఇక బిడ్డలు పుట్టరేమో-"

"గొడ్రాలు గావును"

"బిడ్డా పాపల్లేని ఇల్లు వల్లకాడే"

" ఏకాలం వేడుక ఆకాలానిదే-ఎప్పుడో వయసు మళ్లాక పుడితే ఈ వేడుక వస్తుందా?'

అనసూయకు తల కొట్టుకోవాలని పించేది.

ఇంటి ముందున్న వేపచెట్టుకు ఉరేసుకోవాలని పించేది.

ఎంత మంది దేవతలకు దణ్ణాలు పెట్టు కుందో-

మౌనంగా ఎన్ని రాత్రిళ్లు ఏడుస్తూ కూచుందో-

పెళ్లయి నాలుగేళ్లూ నిండిపోతాయనగాఅనసూయ నెల తప్పింది.

ఇరుగు పొరుగు అమ్మలక్కల మీద వల్లమాలిన కోపం వచ్చింది. ఈ మాత్రం ఆలస్యమయినందుకే ఇన్ని మాటలా ? పదినెలలూ తిరిగేసరికి తను పండంటి బిడ్డను ఎత్తుకుంటుంది. మగబిడ్డనే ఎత్తుకుంటుంది. తనను దెప్పిన వాళ్ల నోళ్లు పడిపోయేలా పనసపండంటి బిడ్డ నెత్తుకుంటుంది.

ఈశ్వరరావు ఎస్.ఎస్.ఎల్.సి. తప్పి కొన్నాళ్లు పొగాకు కంపెనీలోనూ, కొన్నాళ్లూ లేత మిషన్ మీదా కొన్నాళ్లొక వర్క్‌షాపులో వెల్డర్‌గానూ పనిచేసి ప్రస్తుతం ఒక మెకానిక్ షాపులో పని చేస్తున్నాడు. బెంజ్, లేలెండు బళ్లు రిపేర్లు చెయ్యడం దగ్గిర్నుంచి, చిన్నకార్లు దగ్గిర్నుంచి, మోటారు సైకిళ్లు స్కూటర్లు వరకూ అన్నీ బాగు చేస్తాడు. పార్టులు ఎసెంబ్లింగ్, ఫిట్టింగ్, వెల్డింగ్ అన్నిపనులూ వచ్చును.

మనిషి బండగా, పరమ మోటుగా వుంటాడు. దాదాపు ఆరడుగుల మనిషి. మహా కోపిష్టి తండ్రిని మించిన కోపిష్టి.

ఈశ్వరరావు తండ్రి రామాచారి కోపిష్టి పెళ్లాన్నిగాని, పిల్లల్నిగాని కొడితేఇక వాళ్లు చస్తారని కూడా కాసడు. ఆరుగురు మగ పిల్లలు. ఈశ్వరరావు పెద్దవాడు. ఒక్కగానొక్క ఆడపిల్ల. నడి వయసులో చనిపోయే నాటికీ అందరికి పెళ్లిళ్లు చేశాడు రామాచారి. బ్రాడీపేటలో పెద్దలు సంపాదించి యిచ్చిన పెద్దపెంకుటిల్లు వుండనేవుంది.

అనసూయది గుడివాడ. వాళ్లకి పాటిమీద రెండు గదుల పెంకుటిల్లుంది. వానపాములలో మూడెకరాల పొలం వుంది. పత్తి పండుతుంది. తండ్రి రోల్డు గోల్డు నగలు చేస్తాడు. ఇద్దరే కూతుళ్లు అనసూయ పెద్దది.

అనసూయ పెద్ద చదువులు చదువుకోవాలనుకుంది. ఉద్యోగం కూడా చెయ్యాలనుకుంది. ఎస్.ఎస్.ఎల్.సి. లో లెక్కల్లోనూ, ఇంగ్లీషు లోనూ తప్పింది. ప్రయివేటు ట్యూషన్ చదివిమళ్లీ పరిక్షకు వెళ్లింది. గతసారి కంటె ఎక్కువ మార్కులు వచ్చిన మాట నిజమే గాని, రెండంటేరెండు మార్కులు తక్కువలో ఆ రెండు సబ్జక్టులూ పోయాయి. మూడోసారి కడతానంది గాని ఇక చాల్లెమ్మని తండ్రి దెబ్బలాడాడు.

మరో రెండేళ్లకి ఈశ్వరరావుతో పెళ్లయింది.

అనసూయకు నెప్పులొచ్చాయి. అత్తగారు మంత్రసానికి కబురు చేసింది. సులువుగానే పురుడొచ్చింది. రధసప్తమికి ముందు పంచమి ఘడియల్లో పుట్టాడు. ఇలవేల్పు సూర్యనారాయణ పేర పుట్టిన మగబిడ్డకి రవి అనిపేరుపెట్టారు. రవి నిజంగానే రవితేజంతో పెరిగి పెద్దవాడయ్యాడు. రవికి నాలుగోయేట ఈశ్వరరావుకు టైఫాయిడ్ వచ్చింది. జాతకాలు చూశారు. అప్పుడు ఈశ్వరరావుకు ఆయుష్షు లేదన్నారు. రవి తండ్రి గండాన పుట్టుడన్నారు. ఒకసారి చచ్చిపోయేడని మంచం మీంచి దించేశారు. వేప చెట్టు కిందకి చేర్చారు. ఇరవయి నాలుగు గంటలు వచ్చే ప్రాణం పోయే ప్రాణంగా గడిచింది. తరవాత నిమ్మళించింది. తేరుకున్నాడు. మామూలు మనిషి కావడానికి మరొక నెలరోజులు పట్టింది.

ఈ మూడు నెలలూ ఎలాగడిచింది? అనసూయ తన గాజులమ్మేసింది. పెనిమిటికి మందులిచింది. ఇల్లు నడిపించింది.

జబ్బుపడి లేచిన తరవాత ఈశ్వరరావుకు కోపం మరీపెరిగిపోయింది. రవి పెరిగి పెద్దవాడయితే తనకి గండం అని ఎందుకో నమ్మకం ఏర్పడింది. వాడంటే ప్రత్యేక శత్రుత్వం వృద్ధి అయింది.

రవికి పదేళ్లు వచ్చేసరికి ఇంట్లో తగువులు పెరిగాయి. అన్నదమ్ముల మధ్య ఆస్తికోసం ద్వేషాలు పెరిగాయి. ఆ గొడవల్లోనే ఈశ్వరరావు తల్లిమీద చెయ్యి చేసుకున్నాడు. చెప్పరాని బూతులు తిట్టాడు. అంతా ముక్కు మీద వేలు వేసుకున్నారు.

ఈశ్వరరావు పాత గుంటూరులో వేరే కాపురం పెట్టాడు. నాటుగు వాటాల పాతకాలపు డాబా యింట్లో ఒక వాటా. ఇంటి ముందు మూడు కొబ్బరి చెట్లు, ఒక వేప చెట్టుంది. ఆ వేప చెట్టు కింద సాపయిన బండరాయి వుంది. ఆ బండరాయి ఎదురుగా వున్న వాటాలోనే ఈశ్వరరావు వుండేది.

రవి తరవాత ఇద్దరాడ పిల్లలు పుట్టారు.

తరవాత మళ్ళీ మగపిల్లడు పుట్టాడు.

ఇక పిల్లకాయలు చాలనుకున్నాడు.

అనసూయకు ఆపరేషన్ చేయించాడు.

అనసూయ కూడా భారీమనిషే. ఉమ్మడిలో ఉన్నప్పుడు క్షణం తీరిక లేకుండా ఇంటెడు చాకిరీ చేసేది. ఆపరేషన్ చేయించుకున్నాక, అనసూయలొంగి పోయింది. ఆపరేషన్ వల్లకాకపోవచ్చు. పాత గుంటూరు నీరు ఎందుచేతనో తేడా వచ్చింది. శరీరతత్వం మారింది. పూర్వంలా పనులు తేలిగ్గా చెయ్యిలేకపోతున్నది.

చీటికీ మాటికీ భర్తకోపం ఒకటి.

గడగడలాడించేస్తాడు ఇంటి అందర్నీ,

పిల్లలయితే ఉచ్చ పోసేస్తారు.

చేతికి ఏది దొరికితే దానితో కొట్టేస్తాడు. మనిషి దూరంగా వుంటే మొహం మీదికి విసిరేస్తాడు. ఒక ఉదయం డ్యూటీకి వెళ్లేముందు సైకిలు తుడుచుకుంటున్నాడు రెంచితో లూజుగా వున్న నట్టేదో బిగిస్తున్నాడు. రవిని పిలిచాడు. పలకలేదు. నిజంగా వినిపించకనే పలుకలేదు. అంతే రెంచి మొహం మీదికి విసిరాడు.

విసురుగా వెళ్లి కుడికణతకి తగిలింది. చివ్వున నెత్తురు చిమ్మింది. కొంచెం వుంటే కన్ను పోవలసిందే. బిడ్డ గిలగిలాడి పోయేడు. గాయం మానడానికి నెల రోజులు పట్టింది. ఇప్పటికీ రవికి కుడికణత మీద మచ్చ అలాగే వుంది.

రవి రాజకుమారుడిలాగే వుంటాడు. ఎస్సెల్సీలోకి వచ్చే సరికి తండ్రంత మనిషయ్యాడు. వంట చెయ్యడం, అంట్లుతోమడం తప్ప ఇల్లంతా చక్కచెట్టేవాడు. పెద్ద తొట్టెనిండా నీళ్లుతోడేవాడు. బజారుకు వెళ్లి కూరలూ, వెచ్చాలుతెచ్చేవాడు, ఇవికాక తండ్రి చెప్పే పనులు వుండనే వున్నాయి. చివరివాడు భాస్కరం– బాబిగాడంటారు– వాడు మహాబద్ధకిష్టు. తండ్రి ఎవర్నయినా కొడుతుంటే వాడు సర్దుకుంటాడు. ఏ మూలకో వెళ్లి ఏమీ ఎరగనట్టు నక్కేస్తాడు.

ఇద్దరు కూతుళ్లకి పెళ్లి చెయ్యాలి. ఎంతో కొంత సంపాదించి వెనకేస్తేగాని లాభంలేదు. ఈశ్వరరావు లాటరీ టిక్కెట్ల ఏజన్సీ తీసుకున్నాడు. టిక్కట్లమ్మితే కమిషన్ బాగానే కిట్టుబాటు అయ్యేది. తను అమ్మిన టిక్కట్లలో ఎవరికయినా లాటరీ పేలితే- అంటే బహుమానం వస్తే– అందువల్ల కూడా కొంత ముట్టేది. రవికి ఈ లాటరీ టిక్కట్లపనికూడా చెప్పేవాడు తండ్రి. బడికి వెళ్లొచ్చి ఇంటి పనంతా చేసి, ఈ పని కూడా చేసేవాడు. ఫలానా కొట్టు మీద టిక్కెట్లిచ్చిరా, ఫలానావాడు మనకు ఇంత డబ్బులివ్వాలి. అడిగిపట్రా– అని చెబుతుండే వాడు తండ్రి సైకిలు వేసుకొని కాకిలా వూరంతా తిరిగేవాడు రవి. చదువుకోవడానికి టైముండేదికాదు. ఉన్నా, తిరిగి తిరిగి అలిసిపోవడం వల్ల, రాత్రి అన్నం తినేసరికి నిద్రముంచుకొచ్చేది.

తొమ్మిదో తరగతిలోంచి పదిలోకి వచ్చాడు. పరీక్షల్లో మార్కులు రావడంతో సంబంధం లేదు. అటెండెన్సు బాగా వుంటేచాలు. అంతా బ్రహ్మానందరెడ్డి పాసు. కనుక తొమ్మిది పాసయి పదిలోకి వచ్చేశాడు. పదోతరగతి పుస్తకాలు చూస్తే రవికి భయం వేసింది.

పదవతరగతి అన్ని సబ్జక్టులూ ఒకేసారి పాసయిన వాళ్ళకే పై చదువుకు వీలుంటుంది. అంటే కాలేజీలో ఇంటర్మీడిమెట్‌లో చేరవచ్చును. విడివిడి సబ్జక్టులు పాసయి పదవతరగతి పూర్తి చేసిన వాళ్లకి ఈ అర్హత లేదు. గత ఏడాది వరకూ ఈ రూలుండేది. గత ఏడాదే– అంటే 1972లో ఈ రూలు తీసేశారు. ఎలా పాసయినా ఫరవాలేదు. సీట్లు మిగిలితే ఈ విధంగా కంపార్టుమెంటల్‌గా పాసయిన వాళ్లను కూడా ఇంటర్మీడియెట్‌లో చేర్చుకోవచ్చును. అటెండెన్సుంటే చాలు మార్కులు రానవసరంలేదనే సంగతి తెలిసి రవి సంతోషించాడు.

కాని భయపడ్డట్టే రవి పదవతరగతి తప్పాడు. తండ్రి చేతిలో తన్నులు తిన్నాడు. ఇంగ్లీషు, సైన్సు, లెక్కలు మూడు సబ్జక్టులలో తప్పాడు.

చదివిన కాడికి చాలు, మన కుటుంబానికి చదుకు అచ్చిరాదు. జిన్నాటవరు దగ్గిర గాని, బ్రిడ్జి దాటి అరండల్ పేట మొగలోవున్న శంకర విలాస్ దగ్గిరగాని చిన్నకొట్టు తీసుకుని లాటరీ టిక్కట్లు దుకాణం పెట్టిస్తానన్నాడు ఈశ్వరరావు.

అనసూయమ్మ దెబ్బలాడింది.

"ఆ మూడు సబ్జక్టులకూ ప్రయివేటు పెట్టించండి. ఈ సారి తప్పక పేసవుతాడు. ఆ పరీక్షలేవో అయ్యేదాకా లాటరీ టిక్కట్లుపని వాడికి చెప్పకండి". అన్నది భర్తతో.

రవి పాత గుంటూరు నుంచి సిటిబస్‌లో బ్రాడీ పేట వచ్చి ట్యూషన్ చదవనారంభించాడు.

రవి పదిహేనేళ్ల వాడయ్యాడు. మీసం రాలేదు కాని పై పెదవిపైన నీలంగా నూగారు ఏర్పడింది.

అప్పుడప్పుడు బ్రాడీపేట నుంచి ఈశ్వరరావు తల్లి, రవి నాన్నమ్మ– వస్తుండేది. ఆమెకి రవి అంటే ప్రాణమే. వాడు అచ్చు భర్తపోలికే, భర్త చిన్నప్పటి ఫోటో చేస్తే రవిని చూడక్కరలేదు.

'మీ తాతయ్య నీ వయసులో అచ్చునీలాగే వుండేవాడు' అంటుంది రవితో కోటమ్మ.

'నీకెలా తెలుసూ' అని అడుగుతాడు రవి.

' నీపాటి వయసులోనేగా మీ తాతయ్యకూ, నాకూ పెళ్లయింది. పెళ్లి నాటికి మీ తాతయ్యకి పదహారూ, నాకు పన్నెండూ–" అన్నది కోటమ్మ.

కోటమ్మ కొడుకులకు ఏయేభాగాలు తనతదనంతరం యివ్వవలసిందీ లాయర్ను సంప్రదించి వీలునామా రాయించింది. మెడలో మంగళసూత్రం, చేతులకి జత గాజులూ వుంచుకుని మిగతా బంగారం కూతురుకు యిచ్చేసింది. తూర్పు వేపున ఒక గది తనకి వుంచుకుంది.

ఈ సంఘటన జరిగినప్పటి నుంచీ ఈశ్వరరావు తల్లితో కాస్త ప్రేమగా మాట్లాడుతున్నాడు. అంతకు ముందు తల్లి తన ఇంటికి వస్తేనే అరిచేవాడు. పైకి అర్థంకాక పోవచ్చుగాని ప్రేమాభిమానాల వెనక వున్నవి ఆర్థిక సంబంధాలే.

మరొక నెలరోజులు పరీక్షలున్నాయనగా, వసూలు చేసి తెస్తున్న డబ్బులు రవి పారేశాడు. యాభై ఆరు రూపాయలు. ఈశ్వరరావు కొడుకును గూబ పగలేశాడు. వారం పదిరోజులు దాక కుడిచెవి పని చెయ్యలేదు. ఒక రోజు బ్రాడీపేట వెళ్లి నానమ్మతో చెప్పుకున్నాడు.

'నువ్వు యింటికి వెళ్లకు. ఇక్కణ్నే వుండిపో మీ నాన్న వచ్చి అరిస్తే నేచెబుతాలే' అన్నది కోటమ్మ.

అలా చేసేందుకు రవికి ధైర్యం చాల్లేదు.

ఎలాగో పరీక్షలు రాశాడు.

సైన్సు, లెక్కలూ పాసయ్యాడు. ఇంగ్లీషు తప్పాడు.

ఆరోజు తండ్రి కొట్టలేదుగాని తిట్టిపోశాడు. ఈసారి పరీక్షకు కట్టేందుకు డబ్బులివ్వనన్నాడు. మీ అమ్మో, మీ నానమ్మో యిస్తే పుచ్చుకోమన్నాడు. నాకు ఎటూ చదువులేదు. నిన్నయినా చదివిద్దామనుకుంటే నువ్వేమో ఇలా తయారయ్యావు అన్నాడు.

'పోనీలెండి ఒక సబ్జక్టేగదా వుంది. కట్టి పాసయిపోతాడు. వచ్చేయేడు ఇంటర్మీడియెట్‌లో చేర్పిద్దాం'. అన్నది అనసూయమ్మ.

ఈశ్వరరావు డబ్బులివ్వనే లేదు. నాయనమ్మ నలభయి రూపాలియిచ్చి పరీక్షఫీజు కట్టుకో, మిగతావి నీ ఖర్చులు కుంచుకోమంది.

ఆ సంగతి ఈశ్వరరావుకు తెలిసి చాలా గొడవ చేశాడు.

'ఇకేం నాన్నమ్మ దగ్గిరే పెరుగు. నీకిక తండ్రి లెక్క ఏం వుంది' అని ఎగిరాడు.

ఇంటి అందరూ అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని గడిపారు, అరుస్తున్నంత సేపూ. ఎవరయినా రవి తరపున నోరు విప్పారో. వీపు విమానం మోత మోగిందన్న మాటే–

ఇంగ్లీషు పరిక్ష రాశాడు.

ఏం వచ్చును? తెలిసిన వాచరు గనుక పిల్లలకు గ్రామరు పాయింట్లు చెప్పేశాడు. అన్నీ చదివిన ప్రశ్నలే వచ్చాయి. "బాగారాశాను. ఈ సారి తప్పక పాసవుతా"నని మాత్రం చెప్పాడు.

ఆ మర్నాటి నుంచీ ఈశ్వరరావు లాటరీ టిక్కట్లు పనిలో తోమడం ప్రారంభించాడు. అదిగాక మెకానిక్ షాపులో చేరుస్తాను. నీ ఖర్చుకోసం నువ్వు డబ్బులు సంపాదించుకుందువు గానీ అని చెప్పాడు.

ఈ మాట రవిని చాలా గాయపరిచింది.

రవికి ఇంటర్ మీడియెట్‌లో జాయిన్ కావాలని వుంది. పట్టుదలగా బాగా చదువుకోవాలని. తండ్రిలా మోటు చేతుల్తో, మాసిన బట్టల్తో మెకానిక్ పనులు చెయ్యడం కాక, గౌరవంగా ఉద్యోగం చెయ్యాలని వుంది. వాడి బుర్రలో రకరకాల వూహలున్నాయి. వాడి కళ్లనిండా కలలున్నాయి. కాని పిల్లలకు స్వతంత్రంగా ఆలోచించుకోనే హక్కు కూడా లేదుకదా–

"అమ్మా నేను నాన్నలా మెకానిక్‌నికాను. బాగాచదువుకొని మంచి ఉద్యోగంసంపాయిస్తా" అన్నాడు తల్లితో.

అనసూయమ్మ పొంగిపోయింది.

మర్నాడు,"బలరామయ్య నాలుగులాటరీటిక్కెట్లు కొనిపిస్తానన్నాడు. గుజ్జనగూళ్ల పోయిరా," అన్నాడు ఈశ్వరరావు కొడుకుతో.

రవి కాలిలో నిన్ననే గాజుపెంకు గుచ్చుకుంది. జోడు తెగిపోయింది. కొత్తజోడు కొనమంటే కొనలేదు. మాములు కాళ్లతోనే నడుస్తుంటే గాజుపెంకు గుచ్చుకొంది. నడవలేక పోతున్నాడు. లోపల భయంగానే వుంది. తల్లికూడా కాలు కుంటుతూ పాత గుంటూరు నుంచి గుజ్జనగూళ్ల ఎలా వెళతావు.? ఎంత సైకిలు తొక్కితే మాత్రం! మీ నాన్నతో నేజెపుతాలే," అన్నది. లోపల భయపడుతూనే

కుంటుతూ కిరణా కొట్టుకు వెళ్లి కావలసిన సరుకులు తెచ్చి. మిగిలిన చిల్లర తల్లికి యిచ్చేశాడు. ఆ రాత్రి, చెప్పిన పనిచెయ్యనందుకు ఈశ్వరరావు కొడుకును చావబాదాడు. మళ్ళీ కుడి గూబ మీదే తగిలాయి దెబ్బలు. తలకోసిన కోడిలాగా గిలగిలా కొట్టుకున్నాడు బిడ్డ. అడ్డం వెళ్లిన అనసూయ వీపు పగిలింది.

ఆ రాత్రి తెల్లవార్లూ రవికి చెవిపోటుతో నిద్ర పట్టలేదు. వాడి మనసులో ఏమేమి ఆలోచనలు చెలరేగాయో తెలియదు. వాచి మెదడంతా ఏయే ఆలోచనలు ఉడికి పొగలు చిమ్మిందో తెలియదు.

ఉదయం తండ్రి పనిలోకి వెళ్లాక, ఇంత చద్దన్నంతిని. బ్రాడీపేట నాన్నమ్మ దగ్గిరికి వెళాస్తానమ్మా, అని బయలుదేరాడు. చెల్లెళ్ళిద్దరితోనూ నానమ్మ యింటికి వెళ్ళొస్తానని చెప్పాడు. రవి మొహం ఎందుకో అదొకలా పెట్టాడు.

'ఇప్పుడెందుకురా రేపు పోవచ్చులే' అన్నది అనసూయమ్మ

లేదు యిప్పుడే వెళతానని బయలు దేరాడు. తల్లివేపు అదొకలాచూస్తూ వెళ్లాడు.

ఎన్నిదెబ్బలు తిన్నాడు బిడ్డ? అయినా భర్త రానురాను రాక్షసుడైపోతున్నాడు. మొన్నటికి మొన్న పెద్దమ్మాయిని చావబాదాడు. ఈ మనిషితోనా తాను ఇరవయేళ్లు సంసారం చేసింది? ఈ లెక్కన మిగతా జీవితం ఎలా గడుస్తుందోనని బెంగపెట్టుకుంది.

ఆనాడలా బేల చూపులు చూస్తూ వెళ్లిన బిడ్డ, ఈనాటికీ కంటికి కనపడలేదు.

నానమ్మతో అంతాచెప్పి మాములుగా ఇంటికి వెడుతున్నానని మాత్రమే చెప్పాడట. డబ్బులిస్తే పుచ్చుకోలేదట.

కట్టు బట్టల్తో ఇల్లు వదిలి వెళ్లి పోయేడు, ఒక్కపైస పట్టుకెళ్ళలేదు. ఈ సంగతి ఈశ్వరరావు విని– నాలుగు రోజులు అటుయిటూ తిరిగి, వాడే వస్తాడులే' అన్నాడు.

నాలుగు రోజులు–

వారం రోజులు–

రెండు వారాలు–

మూడు వారాలు–

నెల–

రవి జాడలేదు.

పాషాణం లాంటి ఈశ్వరరావు కూడా కొంత ఆందోళన పడ్డాడు. చేతికి ఎదిగిన బిడ్డ, రేపోనేడో సంపాయించి డబ్బు చేతిలో పొయ్యవలసిన బిడ్డ– అని బాధ పడ్డాడు.

ఖర్చులిచ్చి నలుగుర్నీ నాలుగు మూలలకీ పంపాడు.

బంధువులున్న వూళ్లన్నీ పంపాడు. గుడివాడ, వానపాముల, ఏలూరు, తణుకు, చీరాల, రూపల్లె నరసరావుపేట, ఒంగోలు, మైనంపాడు– తెలిసిన అన్నివూళ్లూ పంపించాడు. రవి స్నేహితులందరినీ ఏమయినా చెప్పాడేమో అని అడిగాడు.

రవి జాడలేదు. పేపర్లలో వేయించాడు. ఫలితం లేదు.

అనసూయమ్మ తిండి నీరూ ముట్టలేదు. పిచ్చి దానిలా తయారయింది. పిచ్చి చూపులు చూస్తున్నది.

భర్తమీద చాలా కోపంగా వుంది. ఏం చెయ్యగలదు! చెట్టంత కొడుకు దూరమయ్యాడు– ఎలా వున్నాడో ఏం చేస్తున్నాడో.

పరీక్షా ఫలితాలొచ్చాయి. రవి పేసయ్యాడని అతని స్నేహితులు చెప్పారు. కొడుకు కళ్లల్లో మెదిలి ఆరోజంతా ఎలాగో వుంది అనసూయ. అన్నం తినబోతే నోటికి పోలేదు.

ఒక రోజు రవి స్నేహితుడు వచ్చి ఒక వార్త చెప్పాడు.

రవి స్కూలుకు వచ్చి పదవతరగతి పాసయిన సర్టిఫికెట్టు, ట్రాన్సఫర్ సర్టిఫికెట్టు పట్టుకెళ్లాడట!

అనసూయ నమ్మలేక పోయింది.

ఈశ్వరరావు రవి స్కూల్లో హెడ్ మేష్టార్ని కలిశాడు.

"రవి ఇంట్లోంచి పారిపోయినట్టు తెలుసుగాని, ఇటువంటివి జరుగుతూ వుంటాయి. పిల్లలు మళ్లీ వస్తూవుంటారు అలా వచ్చేడనుకున్నాన"న్నాడాయన.

ఏం చెయ్యాలో తోచలేదు. ఈశ్వరరావుకి

పోలీసు రిపోర్టు ఇస్తే!

అసలు ఎలా వచ్చాడు? ఎక్కడున్నాడు? బ్రాడీపేట కూడా వెళ్లలేదట. మామూలుగా వేసుకునే బట్టలే వేసుకున్నాడట. మనిషిలో ఏం మార్పు కనపడలేదట. చిక్కి పోవడం, బట్టలు, చిరిగిపోవడం అలాంటిదేం లేదట.

'రవీ– తండ్రీ– ఈ పేగు తెంచుకుని పుట్టావురా కన్నా. అమ్మని చూడాలని అనిపించటం లేదా నీకూ? లేక నాన్నమళ్లీ తంతాడని భయపడ్డావా. రవీ రవీ రవీ నా నాయనా– ఒక్కసారి కంటికి కనిపించి వెళ్లరా– కనిపెంచిన అమ్మనురా కనికరించరా నా మీద – ఈ రంపపు కోత భరించలేక పోతున్నారా తండ్రీ–'

అనసూయ ఆకాశం పగిలిపోయినట్టు ఏడిచింది. నేలతల్లి విచ్చుకున్నట్టు ఏడ్చింది. రాళ్లు బీటలు పడేలా ఏడ్చింది.

ఈశ్వరరావుకు కూడా ఆమె ఏడుపుచూసి బాధకలిగింది.

ఏడాది తరవాత బ్రాడీపేట నానమ్మ చిరునామాకు ఉత్తరం వచ్చింది. రవి దగ్గిర్నించి. ఇన్‌లాండ్ లెటరు.

అమ్మ గురించే రాశాడు. అమ్మానన్ను క్షమించ మన్నాడు. చెల్లెళ్లని తమ్ముడ్ని అడిగేనని చెప్పమన్నాడు. నాన్నకు నమస్కారాలు తెలిపాడు. నాన్ననీ క్షమించమన్నాడు. హైదరాబాద్‌లో వున్నాడట. ఒక సేఠ్ దగ్గిర పనిచేస్తున్నాడట. ఆ సేఠ్ తనని బాగానే చూసుకుంటున్నాడట.

అనసూయమ్మ వందసార్లన్నా చదివి వుంటుంది, ఆ వుత్తరం. రవి క్షేమంగానేవున్నాడు. నా నాయన క్షేమంగా వున్నాడు. తనకి అదేచాలు.

ఎక్కడా వస్తాననిరాయలేదు. తన చిరునామా లేదు, పోస్టుముద్రస్పష్టంగాలేదు. ముద్దలా పడింది.

ఈశ్వరరావు కూడా బాధపడ్డాడు, హైదరాబాద్‌లో ఎక్కడని వెదికిస్తాడు. సేఠ్ అంటే ఏ సేఠ్? బట్టల వర్తకుడా? బంగారపు వర్తకుడా?

అనసూయకు కొడుకు గుర్తుకు రాని రోజులేదు కొన్ని గాయాలకు కాలం కూడా మందు వెయ్యలేదు.

పెద్దకూతురు పెళ్లయింది. నెల్లూరు సంబంధం. ఎలాగడిచాయో ఆరేళ్లు గడిచాయి. బెజవాడ నుంచి వీరాచారి వచ్చి రవిని రైల్వే స్టేషన్‌లో చూశానని చెప్పాడు. మాట్లాడ్డానికి కుదరలేదట. గుర్తు పట్టేసరికి ట్రెయిన్ కదిలిపోయిందట. 'సరిగ్గా చూశావా బాబయ్యా' అని గుచ్చి, గుచ్చి అడిగింది అనసూయ.

కుడి కణత మీద మచ్చకూడా చూశానన్నాడు.

సందేహం లేదు. రవే.

బెజవాడ ఎందుకొచ్చాడు? గుంటూరు కూడా వచ్చాడట? సర్టిఫికెట్ పని మీద వచ్చాడేమో–

ఇంత దూరం వచ్చి ఇంటికి రాలేదా? రాలేదు. రావాలని బిడ్డ మనసు కొట్టుకునే వుంటుంది. పంతానికి వచ్చి వుండడు. వస్తే పెద్దచెల్లి పెళ్లి జరుగుతున్నందుకు సంతోషించి వుండేవాడు.

కూతురు పెళ్లిలో ఎలాగో వుంది అనసూయమ్మ. చాలా మంది అడిగేరు. గుండెరాయి చేసుకొని సమాధానం చెప్పింది. ఉన్నంతలో పెళ్లి బాగానే జరిగింది.

కూతురు మొదటిసారి అత్తవారింటికి వెళ్లి వచ్చింది. ఒకరోజు భోజనాలయ్యాయి. మధ్యాహ్నం రెండు గంటల వేళ పోస్టుమాన్ పెద్ద పాకెట్ పట్టుకొచ్చి యిచ్చాడు.

ఏమిటి ఏమిటి ఏమిటని ఇంటందరూ చుట్టూ చేరారు. కోటమ్మ కూడా అక్కడే వుంది.

పాకెట్ విప్పారు.

నాలుగు చీరలు

రంగుల వారీగా ఏయే చీరలు ఎవరెవరికో వుత్తరం వుంది. పెద్దచెల్లి పెళ్లి సంగతి రవికి తెలిసిందనమాట.

మామిడి పిందెల అంచుతో వున్న తెల్లచీర నానమ్మకి,

జరీ అంచు పట్టుచీర అమ్మకి

జరీ పువ్వుల ఆకుపచ్చచీర పెద్దచెల్లికి,

మిగతా చీర చిన్న చెల్లికి—

అనసూయమ్మ దుఃఖం పట్టలేక పోయింది. ఉప్పెనలా పొంగిన ఆమె దుఃఖంతో ఇల్లంతా కన్నీటి మయం అయిపోయింది. కోడల్ని ఊరుకోమన్నది గాని కోటమ్మకీ దుఃఖం ఆగలేదు.

ఆ దుఃఖంలోనే ఆ చీరలు ఎంతెంత ఖరీదుంటాయో అంచనాలు వేశారు.

ఈశ్వరరావు ఉత్తరం చదివాడు.

ప్రయోజకుడయ్యాడంటే "డబ్బు సంపాదిస్తున్నాడు." అని మాత్రమే అర్థం. రవి ప్రయోజకుడయ్యాడు. ఇక ఇప్పుడు తండ్రి చేతిలో దెబ్బలు తిననవసరం లేదు. పైగా తండ్రి ఇప్పుడు నెత్తిమీద పెట్టుకుంటాడు.

అనసూయమ్మకు రవి ఎదిగి చెట్టంతమనిషయి కళ్లముందు మెదిలాడు.

"నాయనా రవీ. ఒక్కసారి కనిపించిపోరా. ఈ గుండెకోత ఇక భరించలేనురా" అనసూయమ్మ కడుపు మెలికలు తిరిగేలా ఏడుస్తున్నది.

రవి రాసిన ఉత్తరం, పంపిన చీరలు— వెక్కిరిస్తుట్టున్నాయి. అవి ఆమె కడుపుకోత మరింత పెంచుతున్నాయి.

*రచన : 25-4-1992*